వెల్లివిరిసిన ప్రజా చైతన్యం

- వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు పోటెత్తిన జనం
- జై జగన్ నినాదాలతో మార్మోగిన కైలాసపురం


సీతంపేట కూడలి వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్


సామాజిక సాధికార బహిరంగ సభలో ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు


డాక్టర్ అంబేడ్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మేయర్ హరివెంకటకుమారి, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు


రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉషా ఆధ్వర్యంలో ఆటాపాటా


నక్కవానిపాలెం నుంచి సభకు బయలుదేరిన కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పార్టీ శ్రేణులు

సీతంపేట/మర్రిపాలెం/సీతమ్మధార: వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రలో ప్రజా చైతన్యం వెల్లివిరిసింది. మాధవధార మిలాన్ ఫంక్షన్ హాల్ వద్ద ప్రారంభమైన బస్సు యాత్ర, బైకు ర్యాలీ మురళీనగర్, కైలాసపురం మీదుగా ఇనార్బిట్ మాల్ రోడ్డులో ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు కోలాహలంగా సాగింది. ముఖ్య అతిథి వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి బస్సు యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయనతోపాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు చేసిన సామాజిక న్యాయం గురించి తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడం ద్వారా కలిగే లబ్ధిని వివరించారు. బస్సు యాత్రలో అడుగడుగునా స్థానిక ప్రజలు, కార్యకర్తలు, మహిళలు జై జగన్ అంటూ సంఘీభావం తెలిపారు. జై జగన్ నినాదాలతో కైలాసపురం ప్రాంతమంతా మార్మోగింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, పి.ఉషశ్రీ, ఆళ్ల లీలావతి, శశికళ, కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, చల్లా రజనీ, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కేపీ బాబా, పార్టీ ముఖ్య నాయకులు, జోన్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఊడా రవి, సేనాపతి అప్పారావు, ఆళ్ల శివగణేష్, అల్లంపల్లి రాజుబాబు, బోని శివరామకృష్ణ, పీలా వెంకటలక్ష్మి, ద్రోణంరాజు శ్రీవత్సవ్, శ్రీదేవీ వర్మ, రాయుడు శ్రీను, నీలి రవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

అన్ని వార్డుల నుంచి 'యాత్ర'కు..

నియోజకవర్గంలోని 17 వార్డుల నుంచి కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లి బహిరంగ సభకు హాజరయ్యారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేట నుంచి ఆటోలు, బైకులపై పెద్ద సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున ర్యాలీగా సాధికార యాత్ర బహిరంగ సభకు తరలివెళ్లారు. కార్పొరేటర్ గోవింద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి నేతృత్వంలో బహిరంగ సభకు నక్కవానిపాలెం నుంచి పార్టీ శ్రేణులు, మహిళలు భారీగా తరలివెళ్లారు.

ఆధునికంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ఎన్జీజీవోస్ కాలనీ ప్రైమరీ స్కూల్ కొత్త భవనం ప్రారంభం


జీవీఎంసీ పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు తదితరులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో రూ.2.17 కోట్లతో కొత్తగా నిర్మించిన జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ కొత్త భవనాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ పాఠశాలలో జరిగిన అభివృద్ధిపై ఏర్పాటు చేసిన నాడు–నేడు ఫొటో ప్రదర్శనను ఆయన తిలకించారు. ఆధునికంగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తరగతి గదిలో ఏర్పాటు చేసిన డెస్క్ బెంచీలు, డ్యాన్స్, గ్రీన్ బోర్డులు, లైట్లు, ఫ్యాన్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రౌండ్‌లో పిల్లల ఆట వస్తువుల ప్రాంగణాన్ని ప్రారంభించి, విద్యార్థులతో ముచ్చటించారు. థ్యాంక్యూ జగన్ మామ అంటూ పిల్లలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రూ.2.17 కోట్లతో ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను పూర్తిగా ఆధునికీకరించినట్లు తెలిపారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా నాలుగేళ్లగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ప్రభుత్వ పాఠశాల రూపురేఖలను మార్చి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. దీనిలో భాగంగా ఈ ఎన్జీజీవోస్ కాలనీ స్కూల్‌ను హైటెక్ స్థాయిలో ఆధునికీకరించారన్నారు. ఎక్కడా రాజీ పడకుండా ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్ స్థాయికి తగినట్టు బాలబాలికలకు అన్ని సౌకర్యాలు కల్పించారని చెప్పారు. తెలుగుతోపాటు ఇంగ్లిష్ మీడియం బోధన, బాలికలకు సౌకర్యవంతంగా ఉండేలా టాయిలెట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునికంగా తీర్చిదిద్దే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులతో పోటీ పడేలా విద్యారంగాన్ని బలోపేతం చేసినట్లు వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, 26వ వార్డు కార్పొరేటర్ ఎం.శ్రావణి, ఏడీసీ సన్యాసిరావు, జెడ్పీ విజయలక్ష్మి, డీఈవో చంద్రకళ, ఎంఈవో రామారావు, ఈఈ సుధాకర్ , డీఈ ప్రసాద్, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదో పట్టణ సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ సీరం భాస్కరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా సీరం భాస్కరరావు బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం ఆయన చాంబర్‌లో సంతకం పెట్టి విధుల్లో చేరారు. గతంలో ఎస్‌ఐగా ఎంవీపీ స్టేషన్ లా అండ్ ఆర్డర్, త్రీ టౌన్ ట్రాఫిక్, పీఎం పాలెం, ఇంటెలిజెన్స్‌లో చేసి అక్కడ సీఐగా ప్రమోషన్ మీద జీఆర్పీకి వెళ్లారు. అక్కడ నుంచి శ్రీకాకుళం దిశలో విధులు నిర్వహించి ప్రస్తుతం ఇటీవల జరిగిన బదిలీల్లో ఫిఫ్త్ టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సిబ్బందితో కలిసి పనిచేస్తానని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనకు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ, సిబ్బంది పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ద్వారకా సీఐగా రమేష్


సీఐ రమేష్

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా ఎస్.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన సీసీఎస్–1లో పనిచేస్తున్నారు. సీఐల బదిలీల మేరకు ద్వారకా స్టేషన్‌కు వచ్చారు. 2004 బ్యాచ్‌గా చెందిన రమేష్ మూడో పట్టణ పోలీస్ స్టేషన్(లా అండ్ ఆర్డర్), పెందుర్తి క్రైం, పీఎం పాలెం ట్రాఫిక్, ఏసీబీ, సీసీఎస్–1లో పనిచేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ న్యాయ, చట్టపరంగా తన వంతు విధులు నిర్వహిస్తానని తెలిపారు. అనంతరం ఆయనను స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'వార్డ్ లెవల్' విజేతలకు బహుమతులు


క్రీడాకారులకు బ్యాట్ అందిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా ఏయూ గ్రౌండ్స్‌లో జరిగిన పోటీల్లో 25వ వార్డు తరఫున గెలుపొందిన క్రికెట్ టీం విజేతలకు శనివారం కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ క్రికెట్ కిట్లు, బాల్స్, బ్యాట్లు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు లక్ష్మణరెడ్డి, హరికృష్ణ, వెంకటేష్, వినోద్, లక్ష్మీకుమారి, జ్యోతి, మదీన, సచివాలయ కన్వీనర్లు బొమ్మాళి రవి, వార్డు యూత్ ప్రెసిడెంట్ సన్నీ, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

మర్రిపాలెం: సింహాచలం రైల్వే స్టేషన్ పరిధిలో పట్టాలపై గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు గుర్తుంచారు. వారు తెలిపిన వివరాలిలా.. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు, 5.2 అడుగుల ఎత్తు కలిగి చాయనఛాయ రంగులో ఉన్న వ్యక్తి నలుపు రంగు ఫ్యాంట్ ధరించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌భాస్కర్ కేసు దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు 0891–2881910, 98481 68309 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నారాయణరావు



మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.నారాయణరావు నియమితుడయ్యారు. ఇక్కడి ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణమూర్తి టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఏడీగా డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇంతవరకు ఎలక్ట్రికల్ హెడ్ కేడీవీ నరసింహారావు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కాలేజీకి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు గుర్తింపు తీసుకు రావాలని టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి ఆదేశించారు. దీంతో ఇక్కడ ఎన్‌బీఏ బృందం పరిశీలనకు అవసరమైన పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. దీంతో ఆముదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావును ఇక్కడ ప్రిన్సిపాల్‌గా డిప్యుటేషన్‌పై నియమిస్తూ కమిషనర్ సి.నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నారాయణరావు ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఎన్‌బీఏ గుర్తింపునకు సంబంధించిన ఏర్పాట్లపై డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, ఇతర అధ్యాపకులు, కార్యాలయ సిబ్బందితో ఆయన సమీక్షించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా


ఉద్యోగాలు పొందిన విద్యార్థినులకు నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో ఇటీవల చెన్నైకు చెందిన గ్రీన్ ఎనర్జీ ఇనీషియేటివ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాల బాలికలు సత్తా చాటారు. టీపీవో ఎం.హరిబాబు పర్యవేక్షణలో ఈ కంపెనీ నిర్వహించిన రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ప్రతిభ చూపిన 8 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సివిల్ విభాగం నుంచి వై.భవాని, జి.పూజితరెడ్డి, మెకానికల్ విభాగం నుంచి అల్లు కరుణ, ఎం.యోగేశ్వరి, వి.సాయివెన్నెల, లంకా నీరజ, ఎం.దేవ హర్షిణి, లాలం శృతి ఉద్యోగాలు పొందారు. వీరికి రూ.3.30 లక్షల వార్షిక ప్యాకేజీని కంపెనీ చెల్లిస్తుంది. శిక్షణలో భాగంగా మొదటి సంవత్సరం రూ.3.30లక్షలు, రెండో ఏడాది రూ.3.60 లక్షలు, శిక్షణ పూర్తయిన తర్వాత రూ.4 లక్షలకు పైగా ప్యాకేజీ ఇస్తారు. రాయితీపై క్యాంటీన్ సదుపాయం ఉంటుంది. వసతి సంబంధించి తగు చర్యలు తీసుకుంటారు. కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు నియామకపత్రాలు అందించారు. విభాగాల హెడ్‌లు కేడీవీ నరసింహారావు, కె.మధుకుమార్, జె.రాజేంద్రప్రసాద్, ఏటీపీవోలు ఎస్.జ్ఞాన ప్రసూన, బి.అర్జునరావు, ఆర్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వాల్తేరు సెమెట్రీ సమస్య పరిష్కారానికి వినతి


కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

మహారాణిపేట: వాల్తేరు సెమెట్రీ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున హామీ ఇచ్చినట్లు ఏపీ క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో కొంత మంది క్రైస్తవులు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వాల్తేరు సెమెట్రీలో స్థలం లేకపోవడం వల్ల చనిపోయిన వారిని ఖననం చేసే అవకాశం లేక ఇబ్బంది పడుతున్నామని, కొత్తగా స్థలం కేటాయించాలని కోరినట్టు వెస్లీ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సెమెట్రీ అధ్యక్షుడు చీడి జార్జి, సెక్రటరీ మ్యాచ్ పీటర్, కోశాధికారి ఫాదర్ థామస్ పుల్లట్, బోర్డు మెంబర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న విజేత పైడిరాజు

మర్రిపాలెం: మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు రైల్వే గ్రౌండ్స్‌లో జరిగాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో సాగర్ నగర్‌కు చెందిన కనకల పైడిరాజు 800 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్ రేస్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సాధించారు. షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుపొందారు. ఈ పోటీల్లో విశాఖ జిల్లాతోపాటు కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం, వరంగల్, అల్లూరి జిల్లాలకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ అడ్వైజర్ సందర రామరాజు, బీజేపీ నాయకుడు మాధవ్ విజేతలకు ట్రోఫీ, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. గీతం దంత వైద్యశాల ప్రిన్సిపాల్ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం వివాహ పరిచయ వేదికకు స్పందన

కంచరపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్‌ఎన్ కాలనీలోని ఓ హోటల్‌లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖ ఆధ్వర్యంలో శనివారం ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి పలువురు ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి తమ పిల్లలకు పెళ్లి సంబంధాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదరి అలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఆరో వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నామని, వీటి ద్వారా ఇప్పటి వరకు 120 మంది వివాహాలు చేసుకుని ఒక్కటయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. సొసైటీ తరఫున షాదీ ఖర్చులు భరించి వివాహాలు జరిపిస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు అబ్బాస్ హుస్సేన్, అమీర్‌ఖాన్, షేక్ అహ్మద్ వల్లి, షేక్ అబ్దుల్ మునీర్, మహ్మద్ లుక్మాన్ తదితరులు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రాంజీ ఎస్టేట్ దళిత సేన కార్యాలయంలో రాంజీ అభ్యుదయ సేవా సంఘం దళిత సేన సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు వాటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలకు తమ వంతు సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ గొల్లమాల మీన, సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో వ్యక్తి మృతి

మర్రిపాలెం: జ్వరంతో బాధపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అహ్మద్ ఖాన్ సోయల్ అనే వ్యక్తి జ్ఞానాపురం హోలీ స్ట్రీట్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. రెండు నెలల నుంచి ఓ షిప్పింగ్ సర్వీసెస్ కంపెనీల్లో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి జ్వరం అని పడుకున్నారు. సదరు వ్యక్తి సోదరుడు గమనించి ఆస్పత్రికి తీసుకువెళ్లి, తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో తన సోదరుడిని నిద్ర లేపడానికి ప్రయత్నించగా.. ఎంతకీ అహ్మద్ ఖాన్ లేవలేదు. దీంతో మృతిచెందాడని నిర్ధారించుకున్న అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.భాస్కరరావు కేసు దర్యాప్తు చేపట్టారు.


బంగారు హారం చోరీ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో బంగారు హారం చోరీకి గురైందని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం గంగానగర్‌లో కొండల రజని కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఈ నెల 1న కొన్ని బంగారు నగలను ఇంట్లో ఉన్న కబోర్డులో ఆమె పెట్టారు. తిరిగి వాటిని శుక్రవారం నాడు చూడగా అందులో 21 గ్రాముల హారం కనిపించలేదు. దీంతో అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో శనివారం ఆమె కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం ఎస్‌ఐ సునీల్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ

సీతమ్మధార: ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ శనివారం రాత్రి ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. సీతంపేటలోని శ్రీహరి వీధి చెందిన సాగర్, దేముడుబాబు అనే యువకులు పక్క పక్క ఇళ్లలో నివసిస్తున్నారు. వీరిద్దరి మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగిందని సమాచారం అందుకున్న ద్వారకా సీఐ రమేష్ వారిని విచారించారు. ఘర్షణకు గల కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కల్యాణ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సీతంపేట: ధనుర్మాస నాలుగో శనివారం సందర్భంగా లలితా నగర్ లలితా పీఠంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజరూప దర్శనంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గోదాదేవికి హారతులిచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు కూర్మనాథాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరుడు, పద్మావతి, అలమేలు, లక్ష్మీదేవి, ఆండాళ్లు అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఇస్కాన్ హరే రామ హరేకృష్ణ సభ్యులు రాధాకృష్ణుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు జరిపారు.

సోషల్ సైన్సెస్ సెంటర్ ఏర్పాటు అవసరం


సదస్సులో పాల్గొన్న మాజీ డీజీపీ ఆంజనేయరెడ్డి

సీతంపేట: పోస్ట్ గ్రాడ్యుయేషన్ హిస్టరీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయని, ఇది విభాగాల మూసివేతకు దారితీసే ప్రమాదముందని మాజీ డీజీపీ సి.ఆంజనేయరెడ్డి అన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ రెండు రోజుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రతి సబ్జెక్టు తనదైన అవసరానికి ఉపయోగపడుతుందని, యూనివర్సిటీలో ఏ విభాగాన్ని మూసి వేయవద్దని ఏయూ ప్రొఫెసర్ సంపత్‌ను కోరారు. నగరంలో సోషల్ సైన్సెస్ సెంటర్ ఏర్పాటు చెయ్యాలని కోరారు. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల గోల్డెన్ జూబ్లీ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. బుల్లయ్య కళాశాల ఆరంభం నుంచి మార్జినల్‌లైన్ విద్యార్థులకు విద్యాసేవలందిస్తున్న కళాశాల అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రను ప్రొఫెసర్ వకులాభరణం రామకృష్ణ సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఏయూ వైస్ చాన్సలర్ కె.సమత ఆవిష్కరించారు. విశాఖ నగర చరిత్ర, సంస్కృతి, పేరు, మూలాలను ఆమె వివరించారు. సదస్సులో దేశవ్యాప్తంగా 50 మంది ప్రతినిధులు, 100 మంది పరిశోధకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీహెచ్‌సీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ కేసీ రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్, డాక్టర్ జె.కృష్ణ ప్రసాద్‌బాబు, ప్రొఫెసర్ మల్లి, గాంధీ, అజీజ్, రూపవాణి, బుల్లయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్‌కే చక్రవర్తి, ఆర్‌వీహెచ్.శ్రీకాంత్, జె.లక్ష్మణబాబు, సోషల్‌సైన్స్ హెడ్ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా 50 వసంతాల వేడుక


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు


డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ 50 వసంతాల వేడుక ఆద్యంతం ఆహ్లాదపరిచింది. కనువిందు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఒకవైపు.. విద్యార్థుల విజ్ఞానాన్ని, ప్రతిభను చాటిచెప్పే దృశ్యమాలిక మరోవైపు వెరసి స్కూల్ ఖ్యాతిని చాటిచెప్పాయి. ఇక్కడ చదువుకుని కలెక్టర్లు, పోలీస్ ఆఫీసర్లు, రాజకీయ ప్రముఖులు, దేశంలో అత్యున్నత సైంటిస్టులుగా పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవంలో భాగస్వాములై.. నేటితరానికి గత స్మృతులను గుర్తు చేస్తూ స్ఫూర్తిని కలిగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పి.మనోజ్ సారథ్యంలో శనివారం జరిగిన ఈ వేడుకల్లో దేశ పండగల ప్రాముఖ్యాన్ని, మన సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పే నృత్యంశాలు, చిన్నారులు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా 50 వసంతాల సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. పాఠశాల విశిష్ట వ్యక్తులను ప్రిన్సిపాల్ మనోజ్ సత్కరించారు. కార్యక్రమంలో రెవరెండ్ జోసెఫ్, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెస్‌ఎఫ్‌ఎస్ ప్రావిన్షియల్ సూపర్‌వైజర్ బి.సురేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్, రెవరెండ్ ఫాదర్ సిహెచ్. విజయకుమార్, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ విజయ్, డాక్టర్ సీతారాం, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులకు ఆదేశాలు

దాబాగార్డెన్స్: జ్ఞానాపురం నుంచి పెందుర్తి వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు మరమ్మతులు, పెయింటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జోన్–5, జోన్–8 పరిధిలోని బీఆర్‌టీఎస్ రోడ్డును శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్–5 పరిధి జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులోని సెంటర్ కారిడార్ పనులు, సర్వీస్ రోడ్డు, ఫుట్‌పాత్ మరమ్మతులు, పాత్‌హోల్ పనులు, సెంటర్ మీడియన్ గ్రిల్స్, ఫుట్‌పాత్ పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టి, పది రోజుల్లోగా పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాల్, సర్వీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు వెంటనే తొలగించాలని జోనల్ కమిషనర్ కృష్ణను ఆదేశించారు. అనంతరం జోన్–8 పరిధి ఎన్ఏడీ నుంచి పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్డును పరిశీలించి సెంటర్ మీడియన్ గ్రిల్స్, డివైడర్లు, ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయమైన పెయింటింగ్ వేయాలని, అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జికి కూడా పెయింటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు రామ్మోహనరావును ఆదేశించారు. అలాగే జ్ఞానాపురం నుంచి పెందుర్తి వరకు తారు రోడ్డు వేసేందుకు అంచనాలు తయారు చేయాలని, జ్ఞానాపురం నుంచి పెందుర్తి వరకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, అనధికారక హోర్డింగ్‌లు, ఫుట్‌పాత్‌లపై అనవసరమైన పోల్స్ వెంటనే తొలగించాని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడును ఆదేశించారు.

ప్రైవేటు స్కూళ్ల సమస్యలపై చర్చ


గొండు సీతారామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అప్సా సభ్యులు

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా) విశాఖ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జె.సోమశేఖర్, పి.భాస్కరరావు నేతృత్వంలో సభ్యులు శనివారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ప్రైవేటు స్కూళ్లకు సంబంధించిన సెలవులు, ఇతర సమస్యలపై ఆయనతో సంఘ నాయకులు చర్చించారు. ముందుగా సీతారామ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు వాసుదేవరావు, రమేష్‌నాయుడు, సత్యనారాయణ, గోవింద్, మురళీధర్, అజయ్, శ్రీనివాసరావు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.